# మినీకథలు

## ఓ టైపు కథ

మంత్రవాది మహేశ్వర్



టైపు నేర్చుకోవడమంటే చాలా మందికి షోకుగా మారిపోయింది. నిజానికి టైపు నేర్చుకోవడానికేనని శ్రద్ధగా వెళ్ళే వాళ్ళు ఎంతమంది అంటే చెప్పడమనేది ముందు తరగతి వాడికి వుద్యోగమిచ్చినంత కష్టం. అమ్మాయిలకు, అబ్బాయిలకు మీటింగు ప్లేసులు ఈ ఇన్‌స్టిట్యూట్‌లు. ఒక అబ్బాయి నిముషానికి ఎన్ని వర్డ్స్ టైపుచేసినా వారంలో ఓ అమ్మాయితో 'లైను' కలుపుతాడు. పెళ్ళిళ్ళ పేరయ్యలు ఎక్కడెక్కడో తిరగనవసరం లేదు. ఇక్కడ తిష్టవేస్తే చాలు బోలెడంత గిరాకీ.

అనగనగా ఓ టైప్ రైటింగ్ యిన్‌స్టిట్యూట్. పేరు ఏదైతేనేంగానీ కాలనీకి చివరన వుంది. ఏ అవర్లో చూసినా ఇన్‌స్టిట్యూట్ నిండుగా వుంటుంది. అంటే కళకళలాడుతుందన్నమాట. కలర్‌ఫుల్‌గా వుంటుందన్నమాట. ఇక్కడ రెండుచిత్రాలు గోచరిస్తాయి. ఒకటి: ప్రతి అవర్లోనూ ముగ్గురు అమ్మాయిలకి తక్కువ వుండరు. రెండు: అందులోంచి రిజల్ట్ లేకపోయినా చేరే వాళ్ళ సంఖ్య పెరుగుతూనే వుంటుంది.

ఓ రోజున ఇన్‌స్టిట్యూట్‌లో మెకానిజమ్ గురించి క్లాసు తీసుకుంటున్నాడు ఇన్‌స్ట్రక్టర్. పరీక్షలు దగ్గర పడుతున్నాయని.

"మనం ఈ టైపు—షార్ట్‌హాండ్ చేసేటప్పుడు ముఖ్యమైనది తప్పుల్లేకుండా చేయడం" అన్నాడు ఇన్‌స్ట్రక్టర్.

"మరి స్పీడు విషయం" అన్నాడు రోజుకో డ్రస్సు వేసుకుని పోజుల కరువును సృష్టించిన రాజు అనే స్టూడెంట్.

అతను అలా అడగ్గానే అమ్మాయిల చూపుల బాణాలు, అబ్బాయిల కోపాల తూటాలు విసిరారు.

"పోయిన ఏడాదిలో ఒక్క మార్నింగ్ బాచ్‌లోంచే ఆరుగురి పెళ్ళిళ్ళు ఈ ఇన్‌స్టిట్యూట్ నుంచి అయ్యాయి" అన్నాడెంతో సీరియస్‌గా టేబుల్ మీదుండే పేపర్ వెయిట్‌ను పట్టి కొట్టిస్తూ.

అంతా అమాయకుల్లా అయిపోయి ఆశ్చర్యంగా చూస్తున్నారు. ●

## ట్రిక్



ఎన్.బి.మురళీధర్

"మళ్ళీ బెండకాయలా....!!" ఆశ్చర్యపోయేరు అనసూయమ్మగారు.

ఈ పది రోజుల్లో యిది ఆరవసారి యిలా బెండకాయలు తేవడం.

సుధాకర్ పట్టించుకోలేదు. చెప్పుల్లో కాళ్ళు దూర్చి బయటకు వెళ్ళిపోయేడు.

గత్యంతరం లేక వాటినే కూరచేయడానికి సిద్ధపడ్డారు.

తరగబోతూ చూశారు. వాటిల్లో చాలామటుకు ముదిరిపోయాయి. కూరకు బొత్తిగా పనికిరావు.

'ఏమిటో వీడికి వయసు మీదపడుతున్నకొద్దీ వివేకం లేకుండా పోతోంది! అంతంత డబ్బులుపోసి యిలాంటి కాయలా తెచ్చుకునేది!! ఊరికే యిచ్చినా ఎవరూ తీసుకోరేమో—' అనుకున్నారు మనసులోనే.

నిజానికి బెండకాయ కూరంటే ఆవిడకూ ఇష్టమే. కానీ ఒకే ఐటమ్‌ని రోజూ తినాలంటే ఎవరికైనా వెగటు పుడుతుంది— అది ఎంత ఇష్టమైనప్పటికీ.

కొడుకు అభిరుచేమిటో ఆవిడకు అర్థంకావడం లేదు.

చాలాసేపు కొడుకు గురించే ఆలోచిస్తూ వుండిపోయేరు.

సుధాకర్ డిగ్రీ పాసయిన ఆరు నెలలకే వుద్యోగం వచ్చింది. గత నాలుగేళ్లుగా ఎ. జి. ఆఫీసులో ఆడిటర్‌గా పన్జేస్తున్నాడు. చాలా నెమ్మదస్తుడు. ఏ విషయాన్నీ తనంత తానుగా అడగడు. ఇతరులు యిచ్చేవరకూ ఎదురు చూస్తాడు.

మొదట్లో బెండకాయకూరంటే వాడికి పెద్దగాయిష్టముండేది కాదు. ఈ మధ్యనే ఎక్కువగా తెస్తున్నాడు— ఎందుచేతనో.

నిముషంతరువాత ఆవిడకు ఏదో స్ఫురించి చిన్నగా నవ్వుకున్నారు.

ఆరునెలల తరువాత సుధాకర్, అరుణ మెడలో మూడు ముళ్ళువేసి యింటికి తెచ్చుకున్నాడు.

అంతే! ఆ తరువాతెప్పుడూ బెండకాయల జోలికి పోలేదు సుధాకర్. ●